
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024



బీఎల్వోల మార్పునకు రంగం సిద్ధం

ఉరవకొండ, ఫిబ్రవరి 8: మండల పరిధిలో 24 మంది బీఎల్వోలను మార్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. వీరిలో ఉరవకొండ పట్టణంలోనే 12 మంది ఉన్నారు. బీఎల్వోలలో కొందరు వీఆర్ఏలని, మరికొందరు దివ్యాంగులని, అందుకే మారుస్తున్నామని అధికారులు అంటున్నారు. ఓటరు తుది జాబితాలో సైతం అనేక తప్పులు దొర్లాయి. బీఎల్వోలను మార్చినా, తప్పులను సరిదిద్దేందుకు చాలా సమయమే పడుతుంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఇలాంటి సమయంలో బీఎల్వోల మార్పు చర్చనీయంగా మారింది. రాజకీయ పార్టీలతో అధికారులు నిర్వహించిన సమావేశంలో సీపీఎం నాయకులు ఈ అంశంపై ప్రశ్నించారు. బీఎల్వోలను మార్చుకునే అవకాశం ఉన్నందునే మార్పులు చేస్తున్నామని ఏఈఆర్వో శ్రీనివాసులు అన్నారు.



ఇదీ.. రాష్ట్రంలో
జగన్ పాలన
ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య
రైతులతో నిరసన ర్యాలీ..
కలెక్టరేట్ వద్ద ధర్నా

అనంతలో నిరసన ర్యాలీ

వలసలు.. ఆత్మహత్యలు



ఎడ్ల బండిపై.. ఉరి వేసుకుని..

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: జగన్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి సాయం అందడం లేదని, ఆత్మహత్యలు, వలసలే వారికి దిక్కయ్యాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. అంతకు మునుపు నగరంలో ఎద్దుల బండ్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. రైతులు మెడకు ఉరితాళ్లు బిగించుకుని, పెట్టేబేడ సర్దుకుని వలస వెళ్తున్నట్లు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రైతులనుద్దేశించి ఈశ్వరయ్య ప్రసంగించారు. రైతులను ఆదుకోవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కరువు, తుపాను వల్ల నష్టపోయిన రైతులకు రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలలో ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పంట నష్టాలతో చితికిపోయిన రైతులను ఆదుకోవడంలో జగన్ సర్కారు పూర్తిగా విఫలమైందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప డిమాండ్ చేశారు. రుణభారంతో అవస్థలు పడుతున్న రైతులకు ఊరటనివ్వడానికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి బండి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటమికి సిద్ధంగా ఉండు జగన్: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: సీఎం జగన్ ఎన్నికల్లో ఓడిపోయేందుకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రతిపక్షాలు, జనాలు రోడ్లపైకి వస్తున్నారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల పైచిలుకు పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. మెగా డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి- దగా డీఎస్సీ విడుదల చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులంతా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా.. సీఎం జగన్‌కు చీమ కుట్టినట్టుగా కూడా లేదని అన్నారు. రైతు భరోసా కింద రూ.13,500 ఇస్తామని డప్పు కొట్టుకున్న జగన్.... కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలుపుకుని రైతు భరోసా ఇస్తూ... అసెంబ్లీలో అంతా తామే ఇస్తున్నట్టు చెప్పడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో జగన్ ఆరితేరారని, అబద్ధాల పుట్టగా మారారని మండిపడ్డారు. ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాతో రాష్ట్రాన్ని జగన్ నడుపుతున్నారని ధ్వజమెత్తారు. అందుకే ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, కార్యవర్గ సభ్యులు లింగమయయ, శ్రీరాములు పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అరెస్టులు
ఇరుకు గదిలో అవస్థలు పడ్డ మహిళలు
చలో విజయవాడకు వెళ్లనివ్వకుండా అడ్డగింత



గుంతకల్లు రైల్వే స్టేషన్ వద్ద పార్కులో కూర్చున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తల నిర్బంధం



గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోని ఇరుకు గదిలో అవస్థలు

అనంతపురం టౌన్/గుంతకల్లు/టౌన్, ఫిబ్రవరి 8: సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన ఆశా కార్యకర్తలను పోలీసులు జిల్లాలో అడుగడుగునా అడ్డుకున్నారు. కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెడికల్ లీవ్స్ తదితర డిమాండ్లతో ఆందోళన చేపట్టేందుకు ఏపీ ఆశాకార్యకర్తల సంఘం, సీఐటీయూ చలో విజయవాడకు పిలుపునిచ్చాయి. దీంతో వియజవాడకు వెళ్లవద్దని హెచ్చరిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఆశా కార్యకర్తలకు పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. విజయవాడకు వెళ్లేందుకు సిద్ధమైన పలువురిని స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించి, రాత్రి వదిలిపెట్టారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో సుమారు వంద మందిని రైళ్ల నుంచి దించేశారు. పలువురిని అదుపులోకి తీసుకుని ఓ గదిలో నిర్బంధించారు. విజయవాడకు వెళ్లేందుకు కర్నూలు జిల్లా పత్తికొండ, తుగ్గలి మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు బుధవారం రాత్రి గుంతకల్లుకు వచ్చారు. అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కిన వారిని జీఆర్పీ పోలీసులు దించేశారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై ఓ ఇరుకు గదిలో అందరినీ కుక్కేశారు. రైలు వెళ్లిపోయేంత వరకూ ఆ గదిలో నిర్బంధించి తలుపులు మూసేశారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. పోలీసులు తమ అదుపులో ఉన్నవారిని తెల్లవారుజామున వదిలిపెట్టారు. మరికొందరు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మరో రైలెక్కి విజయవాడకు వెళ్లారు.

విజయవాడలో అరెస్టులు

జిల్లా పోలీసుల కళ్లు కప్పి విజయవాడకు చేరుకున్న ఆశా కార్యకర్తలను అక్కడి పోలీసులు వదలలేదు. రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి పోలీసు నిఘా నుంచి తప్పించుకున్నారు. ఆటోలలో మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంవైపు వెళుతుండగా దాదాపు వందమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ కల్యాణ మండపంలో నిర్బంధించారు. దీంతో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో అక్కడే నిరసన తెలిపారు. ఆశా కార్యకర్తల పట్ల సీఎం జగన్ దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. మహిళలు అని చూడకుండా పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. సీఎం జగన్ ఇందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆమె హెచ్చరించారు.



విజయవాడలో పోలీసుల అదుపులో ఉన్న ఆశా కార్యకర్తలు



పెద్దపప్పూరులో నోటీసులు అందజేస్తున్న కానిస్టేబుల్

ఆ పశువులు మావే..!

కాజేసేందుకు కొందరి యత్నం
- ప్రమాదంలో గాయపడ్డ ఆవులు, ఎద్దులు
- కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాలలో సేద

రంగంలోకి దిగిన ఓ కానిస్టేబుల్.. బెడిసికొట్టిన వ్యవహారం

తాడిపత్రి, ఫిబ్రవరి 8: పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డ ఆవులను కాజేసేందుకు కల్లూరుకు చెందిన కొందరు ప్రయత్నించారు. వారికి ఓ కానిస్టేబుల్ వత్తాసు పలికారు. గ్రామస్థులు అనుమానించి ఎదురు తిరగడంతో వ్యవహారం బెడిసికొట్టింది. జాతీయ రహదారిపై బుధవారం కంటైనర్ బోల్తా పడ్డ విషయం తెలిసిందే. ఆ ప్రమాదం నుంచి గాయాలతో బయటపడిన కొన్ని ఆవులు, ఎద్దులు గుత్తి అనంతపురం, కాశేపల్లి గ్రామాలవైపు వెళ్లాయి.



కంటైనర్‌పై నాగాలాండ్ నంబర్ ప్లేటు

పెద్దవడుగూరు పశువైద్యశాలకు చేరిన ఆవులు, ఎద్దులు



వాటికి ఆ గ్రామాల ప్రజలు చికిత్స చేయించి తమవద్ద ఉంచుకున్నారు. విషయం తెలుసుకున్న కల్లూరుకు చెందిన కొందరు వ్యక్తులు వాటిని కబేళాలకు తరలించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించారు. పెద్దవడుగూరు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ద్వారా ఆ రెండు గ్రామాలవారికి ఫోన్ చేయించారు. ఆవులు, ఎద్దులను తాను చెప్పిన వారికి అప్పగించాలని ఆ కానిస్టేబుల్ హుకుం జారీ చేశాడని తెలుస్తోంది. ఆ తరువాత కల్లూరుకు చెందిన వారు వెళ్లి, కానిస్టేబుల్ పేరు చెప్పి గ్రామంలో రభస సృష్టించారని సమాచారం. ఆవులు, ఎద్దులు తమవేనని, అప్పగించాలని గొడవ పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన కంటైనర్ తెలంగాణలోని పెబ్బేరు నుంచి బెంగళూరుకు వెళ్లాల్సి ఉన్నింది. అలాంటప్పుడు ఆవులు, ఎద్దులతో కల్లూరువారికి ఏం సంబంధమని గ్రామస్థులు నిలదీశారు. ఆవులు, ఎద్దులను అప్పగించేది లేదని, అవసరమైతే పోలీసులు, అధికారులు ద్వారా అప్పగిస్తామని చెప్పేశారు. దీంతో కేసులు పెడతామని వారు బెదిరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఎస్ఐ శ్రీనివాసులు స్పందించారు. గ్రామస్థుల వద్ద ఉన్న ఆవులు, ఎద్దులను పెద్దవడుగూరు పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

జాడలేని డ్రైవర్

కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రమాదానికి గురైన కంటైనర్ డ్రైవర్ జాడను పోలీసులు ఇంకా గుర్తించలేదు. ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతిచెందారు. ఆవులు, ఎద్దులు కూడా మృత్యువాత పడ్డాయి. కంటైనర్‌కు ఉన్న నంబర్ ప్లేటు నాగాలాండ్ రాష్ట్రానికి చెందినది కావడం గమనార్హం. కంటైనర్‌లో ఉన్న ఆర్‌సీలు తెలంగాణవిగా పోలీసులు గుర్తించారు. తెలంగాణ నుంచి జిల్లా మీదుగా పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసులు హైవేపై తనిఖీలు నిర్వహిస్తే వీటి గుట్టు బయట పడుతుంది. ప్రతి గురు, ఆదివారాల్లో రాత్రి సమయాల్లో పశువుల అక్రమ రవాణా సాగుతోందని సమాచారం. ఈ వ్యవహారంపై ఎస్పీ అన్బురాజన్ ఆరాతీసినట్లు తెలిసింది.

మార్చకపోతే ఓడిస్తాం..!

పెద్దిరెడ్డికి చెప్పిన అసమ్మతి వర్గం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 8: శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చితీరాల్సిందేనని అసమ్మతి నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో తెగేసి చెప్పారు. ఎమ్మెల్యే పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి వర్గీయుడైన వీరాంజినేయులను ఇన్‌చార్జిగా అంగీకరించేది లేదని వారు స్పష్టం చేశారు. అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు మంత్రి పెద్దిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డితో పార్టీ త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. అనంతపురంలోని ఓ హోటల్‌లో ఈ కమిటీని వైసీపీ అసమ్మతి నాయకులు కలిశారు. వీరాంజనేయులే అయితే ఓటమి తప్పదని, టీడీపీ అభ్యర్థికి 30 వేల మెజార్టీ వస్తుందని వారు పెద్దిరెడ్డితో అన్నట్లు సమాచారం. శింగనమలలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆ సెంటిమెంట్‌ను గౌరవించి అయినా అభ్యర్థిని మార్చాలని కోరినట్లు సమాచారం. వీరాంజినేయులు కోసం తాము పనిచేయలేమని ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయం సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాలని అసమ్మతి నాయకులు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, సాకే రామక్రిష్ణ, గోకుల్‌రెడ్డి తదితరులు కోరినట్లు తెలిసింది. అభ్యర్థిని మార్చకపోతే త్వరలో ఆయనకు వ్యతిరేకంగా బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

పీఏబీఆర్ కుడి కాలువకు విడుదలకాని నీరు

నీరు లేక ఎండిపోయిన గొందిరెడ్డిపల్లి చెరువు






చుక్క నీరు కూడా లేని హంపాపురం చెరువు

ఎండిపోయిన చెరువులు.. చెక్‌డ్యాంలు
బోరు బావుల్లో అడుగంటిన జలాలు
వందల ఎకరాల్లో ఎండిపోతున్న ఉద్యాన పంటలు

పంట కన్నీరు!



రాప్తాడు/అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో చెరువులు ఎండిపోయాయి. నెర్రెలు చీలి కళావిహీనంగా మారాయి. చెరువుల్లో నీరు లేక బోరుబావుల్లో నీరు అడుగంటింది. పంటలకు నీరు సరిపోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో పెట్టుబడి కూడా రైతులకు తిరిగిరాలేదు. రబీలో బోరుబావుల కింద సాగు చేసిన పంటలదీ అదే పరిస్థితి. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, అనంతపురం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని మొత్తం 49 చెరువులకు నీరు సరఫరా అవుతుంది. రాప్తాడు మండలంలోని బుక్కచెర్ల, యర్రగుంట, పుల్లలరేవు, గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి, లింగనపల్లి, హంపాపురం-1, హంపాపురం-2, ఎం.చెర్లోపల్లి, మరూరు, చాపట్ల చెరువులు ఉన్నాయి. బుక్కచెర్ల చెరువుకు హంద్రీనీవా నీరు సరఫరా అయ్యింది. మిగతా చెరువులు ఎండిపోయాయి.

మన్నీల సమీపంలో ఎండిపోయిన పీఏబీఆర్ కుడి కాలువ



పంటలు ప్రశ్నార్థకం

ఏటా నవంబరు లేదా డిసెంబరులో కుడి కాలువకు నీరు విడుదల చేసేవారు. అన్ని చెరువులకు ఆ నీరు చేరేది. భూగర్భ జలాలు పెరిగి.. బోరుబావుల కింద పంటలకు తగినంత నీరు అందేది. కానీ ఈ ఏడాది ఇప్పటిదాకా చుక్క నీరు విడుదల కాలేదు. దీంతో బోరుబావుల కింద సాగుచేసిన వేరుశనగ, వరి, బెండ, అనప, టమోటా తదితర పంటలు దెబ్బతింటున్నాయి. ఈ ఏడాది వర్షాలు లేక చెక్ డ్యాంలు, చెరువుల్లో చుక్క నీరు చేరలేదు. పీఏబీఆర్‌లో నీరు తక్కువగా ఉండటంతో కుడి కాలువకు నీరు విడుదల చేయలేదు. ఈ ఏడాది నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని తెలియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యాన పంటలకు దెబ్బ

అనంతపురం రూరల్ మండల పరిధిలోని మన్నీల గ్రామ సమీపంలో పీఏబీఆర్ కుడి కాలువ ఉంది. ఏటా నవంబరు నుంచి మూడు నెలల పాటు కాలువలో నీరు పారేది. ఈ ఏడాది నీరు విడుదల కాపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మన్నీల చుట్టుపక్కల ఉన్న క్రిష్ణంరెడ్డిపల్లి, కందుకూరు ప్రాంతాల్లో వందల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉన్నాయి. దానిమ్మ, చీనీ, అరటి, మామిడితోపాటు టమోటా, వేరుశనగ సాగులో ఉన్నాయి. ఒక్క మన్నీల గ్రామ పరిధిలోనే దానిమ్మ, అరటి, చీనీ పంటలు 900 ఎకరాల్లో ఉన్నాయి. వీటితోపాటు క్రిష్ణంరెడ్డిపల్లి, కందుకూరు ప్రాంతాల్లో మరో వెయ్యి ఎకరాలకు ప్రస్తుతం నీటి సమస్య తలెత్తింది. ఈ ప్రాంతంలోని బోరుబావులు ఎండిపోతున్నాయి. మెట్ట ప్రాంతాల్లోని బోర్లలో నీరు సగానికి సగం తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పలువురు అదనపు బోర్లు వేయిస్తున్నారు. అయినా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. కాలువకు నీటిని విడుదల చేస్తే తప్ప తమ సమస్య పరిష్కారం కాదని అంటున్నారు.



మన్నీల: సాగులో దానిమ్మ

ఒకటిన్నర ఇంచు నీరు..



మూడు ఎకరాలలో చీనీ చెట్లు ఉన్నాయి. వాటిని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాం. మూడు బోర్లలో ఒకటిన్నర ఇంచు నీరు వస్తోంది. కాలువకు నీరు వదిలితే తప్ప సమస్య పరిష్కాం కాదు.

- వెంకటరాముడు, మన్నీల

గొర్రెలకు వదిలేశా..



మాకు 4.5 ఎకరాల పొలం ఉంది. 1.5 ఎకరాల్లో టమోటా సాగు చేశాను. బోరులో నీరు పూర్తిగా తగ్గిపోయింది. కాపునకు వచ్చిన టమోటా పంట నీరు లేక ఎండిపోయింది. దీంతో గొర్రెలకు వదిలేశాను. ఏటా కుడి కాలువ ద్వారా గొందిరెడ్డిపల్లి చెరువుకు నీరు వచ్చేది. బోరులో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండేవి. ప్రస్తుతం చెరువులో నీరు లేకగ్రామంలో చాలా బోర్లలో నీరు తగ్గిపోయాయి.

- గొరవ మల్లన్న, గొందిరెడ్డిపల్లి

బోర్లలో నీరు తగ్గుతోంది..



హంపాపురంలోని రెండు చెరువుల్లో నీరు లేక బోర్లలో నీరు తగ్గిపోతోంది. మాకు 500 చీనీ చెట్లు ఉన్నాయి. రెండున్నర ఎకరాలలో వేరుశనగ సాగు చేశాను. గతంలో బోరులో మూడు ఇంచుల నీరు వచ్చేది. ఇప్పుడు రెండు ఇంచులకు తగ్గిపోయింది. గ్రామంలో చాలా మంది రైతులకు చీనీ చెట్లు ఉన్నాయి. నీరు చాలక కొత్త బోర్లు వేయిస్తున్నారు.

- మధు, హంపాపురం

బీడు పెట్టేశాను..



కాలువ నీరు విడుదల కాకపోవడంతో బోర్లలో నీరు చాలా వరకు తగ్గిపోయింది. దీంతో పంట సాగు తగ్గించేశా. నాలుగు ఎకరాల్లో వేరుశనగ, చీనీ ఉంది. వాటికే నీరు సరిపోవడం లేదు. దీంతో మరో రెండు ఎకరాలు బీడుగా వదిలేశాను.

- లక్కప్ప, మన్నీల

వేసవిలో ఏం చేయాలో..?



ఐదు ఎకరాల్లో దానిమ్మ, చీనీ సాగు చేశాను. రెండు బోర్లు ఉండేవి. రెండున్నర ఇంచుల వరకు నీరు వచ్చేది. నాలుగు నెలల కిందట బాగా నీరొచ్చే బోరు ఎండిపోయింది. రెండు నెలల కిందట మరో బోరు వేయించాను. 460 అడుగుల్లో ఇంచు నీరు వస్తోంది. వాటితోనే సర్దుకుంటున్నాం. వేసవి రాకముందే సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో ఏం చేయాలో తెలియడం లేదు.

- నారాయణస్వామి, మన్నీల

ఎటు చూసినా తప్పులే..!

ఓటరు జాబితాలో డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు

ఏళ్ల కిందట ఇతర ప్రాంతాలకు వెళ్లినా తొలగించని అధికారులు

బీఎల్ఏల ఫిర్యాదులు బుట్టదాఖలు



కురుగుంట ఓటరు జాబితాలో తోపుదుర్తి గ్రామస్థులు



కురుగుంట జాబితాలో ఒకే వ్యక్తి పేరుతో మూడుఓట్లు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: తుదిఓటరు జాబితాలో ఎటుచూసినా తప్పులే కనిపిస్తున్నాయి. ఏ జాబితాను పరిశీలించినా డబుల్, ట్రిబుల్ ఓట్లు తారసపడుతున్నాయి. వీటికితోడు ఏళ్ల కిందట ఇతర ప్రాంతాలకు వెళ్లినా జాబితాలో ఓటు ఉన్నట్లు నమోదు చేశారు. వీటికి సంబంధించి అన్ని ఆధారాలతో బీఎల్ఏలు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదు. దీన్నిబట్టిచూస్తే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బీఎల్ఓలు పనిచేశారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

● ఎన్ స్నేహచౌదరి (ఎన్‌డీఎఫ్ 1709765), నాప నరసింహులు(ఎన్‌డీఎఫ్ 17 09781) వీరు మండలంలోని పాపంపేటలో నివాసముంటున్నారు. వీరి ఓట్లను ఓటర్ జాబితాలో నుంచి తొలగించారు. ఎస్.నాగమ్మ(డీజీఎన్0342964) గుంతకల్లుకు వెళ్లిపోయారు. ఎ.సుంకన్న (డీజీఎన్0340 158) రాయదుర్గంలో ఉంటున్నాడు. ఎస్.బాజక్క (డీజీఎన్0342386) గుత్తిలో ఉన్నారు. వీరంతా పదేళ్ల కింద ట గ్రామం విడిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ మేరకు బీఎల్ఏలు బీఎల్ఓలకు ఫిర్యాదు చేశారు. అయితే వీరి ఓట్లను జాబితాలో అలానే ఉంచారు. ఇలాంటి ఓట్లు స్థానిక జాబితాలో పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం.

● కురుగుంటలో నల్లబోతుల ఈశ్వరయ్య (ఎన్‌డీఎఫ్12 74968), (ఎన్‌డీఎఫ్1581578), (ఎన్‌డీఎఫ్0533760)పేరిట 58, 59, 60 పో లింగ్ కేంద్రాల్లో ఓట్లు నమోదయ్యాయి. ఏ కీర్తన (ఎన్‌డీఎఫ్1757517), రాజగోపాలనగ్రావుల (ఎన్‌డీఎఫ్0881038), శ్రీనివాసచౌదరి (ఎన్‌డీఎఫ్083 6868)వీరు కురుగుంటలోనే ఉన్నారు. అయితే జాబితాలో వీరికి ఓటు నమో దు చేయలేదు. ఓబులమ్మ (ఎన్‌డీఎఫ్1140656), వేణుగోపాల్‌రావు (ఎన్‌డీఎఫ్1142322), జామునబీ పేతేన (ఎన్‌డీఎఫ్0827008)) వీరు మరణించారు. అయినా జాబితాలోనే ఉంచారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిగ్రామానికి చెందిన వారికి సంబంధించిన ఓట్లు పదుల సంఖ్యలో గ్రామంలో ఉన్నాయి. అయినా తొలగించలేదు.

రాప్తాడులో...




చిట్రెడ్డి మౌనిక పేరుతో బుక్కచెర్ల, బొమ్మేపర్తిలో ఉన్న ఓట్లు

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో మరణించిన వారి పేర్లు సైతం తుది ఓటరు జాబితాలో ఉన్నాయి. మరణించి ఏళ్లు గడుస్తున్నా వారి పేర్లు తొలగించలేదు. రాప్తాడు గ్రామానికి చెందిన గవ్వల పప్పూరమ్మ మూడేళ్ల క్రితం చనిపోయింది. ఇటీవల విడదల చేసిన ఓటరు జాబితాలో 139 కేంద్రంలో ఎన్‌డీఎఫ్ 1149815తో ఓటు ఉంది. రాప్తాడు గ్రామానికి చెందిన కుంటిమద్ది ముత్యాలప్ప రెండేళ్ల కిందట చనిపోయాడు. ఓటరు తుది జాబితాలో 141 కేంద్రంలో డీజీఎన్ 2819241తో ఓటు ఉంది. బొమ్మేపర్తి గ్రామంలో 10 మంది మరణించినా వారి ఓట్లు తొలగించలేదు. బొమ్మేపర్తికి చెందిన చాకలి రామాంజనేయులు ఏడాది కిందట మరణించా డు. ఓటరు జాబితాలో డీజీఎన్ 4625117తో ఓటు అలాగే ఉంది. బొమ్మేపర్తికి చెందిన అప్పిరెడ్డి గారి చంద్రమ్మ దాదాపు ఏడాది కిందట చనిపోయింది. తుది ఓటరు జాబితాలో డీజీఎన్ 2883890 తో ఓటు ఉంది. బొమ్మేపర్తికి చెందిన మల్లికార్జునరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, చిట్రెడ్డి తిమ్మక్క రెండు నెలల కిందట మరణించారు. ఓటరు జాబితాలో డీజీఎన్ 4625562, డీజీఎన్ 4625612, డిజీఎన్ 2886216 తో ఓట్లు ఉన్నాయి.


కొందరికి రెండు ఓట్లు

మండలంలోని బొమ్మేపర్తి, భోగినేపల్లి ఇతర గ్రామాల్లో కొంత మందికి రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మేపర్తికి చెందిన చిట్రెడ్డి మౌనికకు రెండేళ్ల కిందట బుక్కచెర్లకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె పేరు మీద బొమ్మేపర్తి, బుక్కచెర్లలో రెండు ఓట్లు ఉన్నాయి. భోగినేపల్లిలో తుమ్మల రుక్మిణమ్మ పేరుతో సీరియల్ నెంబర్ 31, 317లో రెండు ఓట్లు ఉన్నాయి. ఇలా మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో మరణించిన, వివాహాలు అయి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి ఓట్లు, డబుల్ ఓట్లు అలాగే ఉన్నాయి. ఓటరు తుది జాబితాలో తప్పుల తడకగా ఉంది.

అవే తప్పులు రిపీట్..



అశోక్‌రెడ్డి కొండారెడ్డి పేరుమీద ఉన్న డబుల్ ఓట్లు



వెంకటతిమ్మాపురంలో సురేష్‌కు ఓటున్నా డిలీట్ చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: మండలంలోని తుంపర్తి గ్రామంలోని ఓటరు జాబితాలో అవే తప్పులు రిపీటయ్యాయి. బూత్‌నెంబర్ 274లో సీరియల్ నెంబర్ 11, 12లో అశోకొరెడ్డి కొండారెడ్డి పేరుమీద రెండు ఓట్లు నమోదయ్యాయి. అదేబూత్‌లో సీరియల్‌నెంబర్ 63లో యర్రగుంట నీరజ గ్రామంలో ఉన్నా ఓటును తొలగించారు. వెంకటిమ్మాపురం గ్రామంలో బూత్ నెంబర్ 271లో సీరియల్ నెంబర్ 118లో టీ సురేష్ గ్రామంలో ఉన్నా జాబితాలో ఓటును తొలగించారు. బీఎల్ఓల నిర్లక్ష్యంతోనే తప్పులు దొర్లాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆర్టీఓ ఆఫీస్‌లో సర్వర్ సమస్య..!

- నాలుగు రోజులుగా స్తంభించిన ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షలు
- పరిపాలన విభాగంలో పనులకు బ్రేక్
- వాహనదారుల నిట్టూర్పు



ఖాళీగా దర్శనమిస్తున్న ఎల్ఎల్ఆర్ పరీక్షా కేంద్రం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8: జిల్లాలోని ఆర్టీఓ కార్యాలయాల్లో సర్వర్ సమస్య తలెత్తింది. నాలుగు రోజులుగా సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షల కోసం ప్రతిరోజు పదుల సంఖ్యలో వాహనదారులు అనంతపురం ఆర్టీఓతోపాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లోని కార్యాలయాలకు వస్తున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షలు బంద్ అయ్యాయి. దీంతో అనుకూలమైన తేదీలకు ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్ష స్లాట్‌లను మార్చుకోవాలని ఆర్టీఓ అధికారులు ఉచిత సలహా ఇచ్చి వాహనదారులను వెనక్కి పంపుతున్నారు. సర్వర్ మొరాయింపుతో పరిపాలన విభాగంలోనూ పలు రకాల ఫైల్స్ పెండింగ్‌లో పడ్డాయి. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ రెన్యూవల్స్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పర్మిట్స్, ఆధార్ సీడింగ్, ఇంటర్‌నేషనల్ లైసెన్స్ పనులు పూర్తిగా బంద్ అయ్యాయి. తమ పనుల కోసం ప్రతి రోజు ఆర్టీఓ కార్యాలయాలకు వాహనదారులు వెళ్లినా సర్వర్ ఇంకా పనిచేయలేదని అధికారులు చెబుతుండటంతో చేసేది లేక వెనుతిరుగుతున్నారు. ఇదిలా ఉండగా... సర్వర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సర్వర్ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు అనంత ఆర్టీఓ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఆర్థిక క్రమశిక్షణలేని బడ్జెట్

మాజీ మంత్రి పరిటాల సునీత



అనంతపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణ లేని బడ్జెట్‌గా ఉందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం ఎంత.?. దేని ద్వారా వస్తోంది..? ఖర్చులు ఎంత అన్నది కనీస స్పష్టత లేనివిధంగా బడ్జెట్ ఉందని అన్నారు. గురువారం అనంతపురంలోని తన నివాసంలో పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేలా బడ్జెట్ ఉందనేది మరోసారి ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. ప్రభుత్వం చేసిన రూ. 9 లక్షల కోట్ల అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో చూపిన కేటాయింపులకు తగ్గట్టు ఖర్చులు లేకనే రైతులు పంటల సాగుకు దూరమవుతున్నారన్నారు. డిస్కమ్ బకాయిలు రూ. 27,284 కోట్లుగా చెబుతున్న ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడకుండా వ్యవహరిస్తోందన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. నాసిరకం మద్యంతో 30 వేల మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైద్యం కోసం ఎంతో చేస్తున్నామని చెప్పుకునే జగన్ సర్కారు బడ్జెట్‌లో మాత్రం ఆరోగ్యశ్రీకి అంతంత మాత్రంగానే నిధులు ఇచ్చారన్నారు. 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్య పెంచాల్సిందిపోయి తగ్గించారన్నారు. సున్నావడ్డీ, పంట రుణాలను 5 లక్షల నుంచి 3 లక్షలకు కుదించడం ఏంటని ప్రశ్నించారు. చేనేతలు తీవ్ర కష్టాల్లో ఉంటే ఈ బడ్జెట్‌లో వారికి కనీసం సంతృప్తి చెందే ప్రకటన చేయలేదన్నారు. సామాన్యుడికి ఏ మాత్రం స్వాంతన లేనివిధంగా వ్యవహరిస్తున్న జగన్ సర్కారుకు ఇదే తుది బడ్జెట్ అవుతుందని పరిటాల సునీత స్పష్టం చేశారు.

అంకెల్లో సంక్షేమం.. ఊహల్లో అభివృద్ధి

ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



అనంతపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంకెల్లో సంక్షేమం.. ఊహల్లో అభివృద్ధి అన్న చందంగా ఏపీ బడ్జెట్ తయారైందని టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా ఉందన్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో కరువు ఓ వైపు పరిశ్రమలు రాక మరోవైపు వలసలు కొనసాగుతుంటే అంతా అద్భుతంగా ఉన్నట్లు బుగ్గన చెప్పుకుంటుండటం దారుణమన్నారు. అభివృద్ధి గురించి చెబుతున్న జగన్ సర్కారు రాష్ట్రంలో కనీసం రోడ్లు వేయలేని దుస్థితిలో ఉందన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అసలు జిల్లాకు ఎంత కేటాయించారన్నది స్పష్టత లేదన్నారు. హంద్రీనీవాతోపాటు హెచ్ఎల్సీ కాలువల గురించి ప్రస్తావనే లేదన్నారు. మరోవైపు రైతులకు స్వాంతన కలిగించేలా ఈ బడ్జెట్‌లో ఒక్క అంశం లేదన్నారు. డిస్కమ్ బకాయిలు రూ. 27,284 కోట్లుగా చెప్పిన సర్కార్ సామాన్యులపై విద్యుత్ చార్జీల రూపంలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలు భారం మోపిందని మండిపడ్డారు. మద్యపాన నిషేధం అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పుడు అదే మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే సర్కార్‌ని నడుపుతున్నారని విమర్శించారు. నాసిరకం మద్యంతో వేలాది మంది పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలను పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాలను మభ్యపెడుతూ మరోసారి మోసానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌నే కాదు ప్రజలు సర్కారును నమ్మడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అంతా పన్నుల బాదుడే: ఆలం



నార్పల: పన్నుల బాదుడే తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ లోటును రూ. 13 వేల కోట్ల నుంచి రూ. 44వేల కోట్లకు, ద్రవ్యలోటును రూ. 35 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత ఈ వైసీపీ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. అప్పులు రెట్టింపు అయ్యాయని, వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి స్కీం.. ఓ స్కామ్ లాగా మారిందని అన్నారు. పలు సంక్షే పథకాలను రద్దు చేసి.. అన్ని వర్గాల ప్రజలనూ తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. కరెంట్, రిజిస్ట్రేషన్ తదితర చార్జీలను విపరీతంగా పెంచి.. ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని వేసిందని ధ్వజమెత్తారు.

బైక్‌లు చోరీచేసే దొంగల అరెస్టు

29 ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8: ద్విచక్రవాహనాలు చోరీ చేసే నలుగురు దొంగలు పట్టుబడ్డారు. అనంతపురం సీసీఎస్, టూటౌన్, కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితోపాటు ఇద్దరు మైనర్లను పోలీసులు జేజే బోర్డు ఎదుట హాజరు పరిచారు. వారి నుంచి రూ.25లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. అరెస్టయినవారిలో అనంతపురం నాలుగోరోడ్డుకు చెందిన నరేష్, పంగల్‌రోడ్డు సమీపంలో ఉంటున్న మహేంద్ర, అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన నాని కుమార్‌లు, మరో ఇద్దరు మైనర్లు మంచి స్నేహితులు. జల్సాలకు బానిసలైన వీరు వాహనాల చోరీలకు పాల్పడుతూ వచ్చారు. ఈ ఐదుగురు పట్టణ ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు, జిల్లా సర్వజన ఆసుపత్రి తదితర రద్దీ ప్రాంతాలకు వెళ్లడం, అక్కడ పార్క్ చేసిన వాహనాలను టార్కెట్ చేసేవారు. నకిలీ తాళాలతో బైక్‌లను ఎత్తుకెళ్లేవారు. అలాంటి వాహనాలను నరేష్ తక్కువ ధరకే విక్రయించి వచ్చిన సొమ్మును జల్సాలకు వినియోగించేవారు ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీటౌన్, తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్నాటక రాష్ట్రం బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో బైక్‌లు దొంగలించారు. నాలుగు రోజుల క్రితం నల్లచెరువు మండల కేంద్రంలో ట్రాక్టర్‌ను దొంగలించి కళ్యాణదుర్గంలో తక్కువ ధరకే విక్రయించారు. బైక్‌లను దొంగతనాల కోసం అద్దెకారును ఉపయోగించేవారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం, సీసీఎస్ టూటౌన్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్దన్, క్రాంతికుమార్, ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుళ్లు బయన్న, శ్రీనివాస్, తిరుమలేష్, కానిస్టేబుళ్లు రంజిత్, శ్రీధర్‌ఫణి, వన్నూరుదాస్, ఆసిఫ్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి వారిని పంగల్‌రోడ్డు సమీపంలో పట్టుకున్నారు. వారి నుంచి 24బైక్‌లు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీ..

అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటలోని చంద్రబాబునగర్‌కు చెందిన పోతులజాన్ ఇంటి ఖర్చులు, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వారి నుంచి ఒత్తిడి రావడంతో వాటిని తీర్చడానికి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆసుపత్రికి జనం విరివిగా వస్తారని ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. నకిలీ తాళాలతో రెండు నెలల కాలంలో ఐదు ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో అర్బన్ సీఐ హరినాథ్, ఏఎస్ఐ ఖాదర్‌బాషా, కానిస్టేబుళ్లు గంగాధర్, సురేంద్ర, హనుమంతరాయుడు, మహేష్‌లు బృందంగా ఏర్పడి అనంతపురం బైపాస్‌లో నిందితుడిని అరెస్ట్ చేసి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రానున్న ఎన్నికల్లో జిల్లా అభివృద్ధే అజెండా కావాలి

'అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకావిష్కరణ చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో జిల్లా అభివృద్ధి ప్రధాన అజెండా కావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం పెన్షనర్ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో 'అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, నీటిరంగ నిపుణులు ఎస్ఎం బాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఖనిజ వనరులు విస్తారంగా ఉన్నా వాటి ఆధారంగా పరిశ్రమలు నిర్మించలేదన్నారు. పనుల కోసం గ్రామీణ పేదలు, చదువుల కోసం పిల్లలు, ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నా పాలకులు పశ్చాత్తాపం పడటం లేదన్నారు. డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలు కీలకమైనవన్నారు. ఈ రంగాలన్నింటిల్లో జిల్లా అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి దూరమైన వారి బాధలను రానున్న ఎన్నికల అజెండాగా చేయడానికి సీపీఎం పార్టీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక హక్కుల నాయకుడు సత్యబోస్, మాజీ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, లలిత కళాపరిషత్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ ప్రసూన, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, రిటైర్డ్ తహసీల్దార్ జయరామప్ప, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు టీజీఎన్‌బీ రావు, రచయిత నానీల నాగేంద్ర, రాహుల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వినాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటనారాయణ, ముష్కిన్ పాల్గొన్నారు.

8 మందికి ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా బాధ్యతలు

రాజకీయ పలుకుబడి ఉన్న వారికి అందలం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న 8 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలను నియమించారు. ఆయా మండలాలు, పక్క మండలాల్లోని ఈఓఆర్డీలు, ఏఓలకు ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా బాధ్యతలు అప్పగిస్తూ గురువారం జడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మనహాల్ ఎంపీడీఓగా ఈఓఆర్డీ విజయమ్మ, కణేకల్లు ఎంపీడీఓగా ఈఓఆర్డీ గూడెన్న, గార్లదిన్నె ఎంపీడీఓగా ఈఓఆర్డీ వెంకటలక్ష్మమ్మ, అమడగూరు ఎంపీడీఓగా పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ ఈఓఆర్డీ అశోక్ కుమార్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కొత్తచెరువు ఎంపీడీఓగా ఈఓఆర్డీ సిద్దారెడ్డిని, చిలమత్తూరు ఎంపీడీఓగా ఏఓ రామ్‌కుమార్‌ను, రొద్దం ఎంపీడీఓగా ఈఓఆర్డీ కేశవరెడ్డిని, రొళ్ల ఎంపీడీఓగా ఆర్‌వీవీజీ ప్రసాద్‌ను నియమించారు. అయితే కొన్ని మండలాల్లో ఈఓఆర్డీ, ఏఓలు ఉన్నా వారిని కాదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పారని పక్క మండలాల్లో పనిచేసే కొందరు అధికారులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా నియమించినట్లు విమర్శలు వస్తున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8: ప్రధానోపాధ్యాయుల అకౌంట్ టెస్ట్-2024కు దరఖాసులుఉ కోరుతున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్ టెస్ట్ పేపర్-1, పేపర్-2కు సంబంధించి పరీక్ష ఫీజులు రూ. 150, ఒక పేపరుకు అయితే రూ. 100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 17వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. రూ. 60 ఫైన్‌తో ఈ నెల 22వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. పరీక్ష ఫీజును గేట్‌వే ద్వారానే చెల్లించాలని, అదేవిధంగా అప్‌లోడ్ చేసిన దరఖాస్తును ఈనెల 23వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని ఆ ప్రకటనలో సూచించారు.

15న జాబ్‌మేళా

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: నిరుద్యోగ యువత కోసం ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా కొంగారెడ్డిపల్లిలోని విజ్ఞానసుధ డిగ్రీ, పీజీ కాలేజీలో జాబ్‌మేళా ఉంటుందని, దాదాపు 100పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటున్నాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అర్హతను బట్టి వేతనం ఉంటుందన్నారు. చెన్నై, బెంగుళూరుతోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 83744 21195, 81425 09017, 63009 54441 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ హరిబాబు గురువారౌ ఒక ప్రకటనలో కోరారు. డివిజన్‌లోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఆ రోజున ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారులు ఈనెల 19లోపు పోస్టు ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. పోస్టు కవరుపై డాక్ అదాలత్ అని తప్పకుండా రాయాలన్నారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం పరిష్కార లెటర్‌ను ఈ-మెయిల్ ద్వారా పంపుతామన్నారు.

ట్రేడ్‌మార్క్ హెచ్చరిక ప్రకటన

మా క్లయింటు వేజళ్ల ధనుంజయరావు, S/o. బసవేశ్వరరావు, మేనేజింగ్ పార్ట్‌నర్ లక్ష్మీదుర్గా రైస్ ఇండస్ట్రీస్, వేజళ్ళవారిలంక గ్రామం, పేటేరు (పోస్ట్), రేపల్లె మండలం - 522265, బాపట్ల జిల్లా.



మా క్లయింటే Durga's Apple అనే బ్రాండ్‌తో రైస్ వ్యాపారం చేస్తున్నారు. Durga's Apple (దుర్గా'స్ యాపిల్) ట్రేడ్‌మార్కు యొక్క యజమానులు మరియు పూర్వ అడాప్టర్లు ట్రేడ్‌మార్క్ నెం. 5734304. పై పేర్కొన్న వస్తువుల తయారీ మరియు రిటైల్ సేల్ మార్కెటింగ్ మరియు పంపిణీకి సంబంధించిన అన్ని వస్తువుల ట్రేడ్ మార్కెట్ పైన చిత్రీకరించిన ట్రేడ్‌మార్కును ఎవరైన కాపీ చేయటం లేదా అనుకరించడం మా క్లయింట్‌ల యొక్క చట్టపర మైన హక్కులను ఉల్లంఘించేలా చేస్తుంది. ఈ చట్టపరమైన హక్కును ఎవరైనా ఉల్లంఘించిన యెడల వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకొనుట జరుగును అని హెచ్చరిస్తున్నాము.

కె.శివశంకర్, న్యాయవాది
అంబా కన్సల్టెన్సీ సర్వీసెస్, ట్రేడ్ మార్కులు, పేటెంట్లు & కాపీరైట్ అటార్నీలు
రింగ్‌రోడ్, విజయవాడ-8, ఏ.పి.
Cell: 9885447471, Mail-ID : ambaconsultancyservices@gmail.com



ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి Goverment colleges లో B.Sc (Nursing),B.Sc (MLT),BPT(ఫిజియోథెరపీ)GNM (Nursing) DMLT (బ్లడ్ టెస్ట్ కోర్సు) నందు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు కాలేజీలోనే హాస్టల్ వసతి కలదు.సంప్ర: జి.మురళి,అనంతపురంసెల్ : 9030661651
AJA- 176953

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 176954

వంట మనిషి కావలెను

అల్ట్రాటెక్ పరిశ్రమలోని అన్నపూర్ణ క్యాంటీన్ నందు పనిచేయుటకు వంట మాస్టర్ కావలెను ఆకర్షనీయమైన జీతం కలదు సంప్ర: Cell:7661959684,7997596699.
AJA-SATHISH

డ్రైవర్స్ కావలెను

అనంతపురం నగరంలో ప్రముఖ ఏజెన్సీ నందు పనిచేయుటకు లగేజ్ ఆటో & సుప్రో గూడ్స్ వెహికల్, లైసెన్స్ కలిగిన డ్రైవర్స్ కావలెను. జీతం 15,000/- లోకేషన్ @ అనంతపురం. Cell:741693246,9886008223.
AJA-NOOR

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

చెక్కమగ్గం తయారుచేసే దుకాణం దగ్ధం

రూ.12 లక్షల ఆస్తి నష్టం



దుకాణంలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 8: పట్టణంలోని కదిరిగేటు వద్ద చెక్కమగ్గం తయారు చేసే దుకాణం బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. 35 ఏళ్లగా చెక్కమగ్గాలు, మగ్గానికి సంబంధించి సామగ్రిని తయారు చేస్తూ జీవనంసాగిస్తున్నానని, గుర్తు తెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పు పెట్టారని బాధితుడు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశాడు. దుకాణం నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. దుకాణంలో ఉన్న 350 దోస్లు, మిషన్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయని, రూ.12లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. జరిగిన సంఘటనపై ఆరాతీసి భరోసా ఇచ్చారు. అదేవిధంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, గోసల శ్రీరాములు బాధితుడిని పరామర్శించారు. బీజేపీ నాయకులు డిష్‌రాజు, బోడగలగిరిధర్, తుంపర్తిపరమేశ్, దుస్సాక్రిష్ణ, నబీరసూల్, నారాయణస్వామియాదవ్, పొరాళ్లరహీం దుకాణాన్ని పరిశీలించి జరిగిన నష్టంపై ఆరాతీశారు.

మళ్లీ ఉద్యమబాట తప్పదు

రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీఎన్జీఓ అసోసియేషన్ నాయకుల అల్టిమేటం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: తమ డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని లేదంటే ఉద్యమబాట తప్పదని ఏపీఎన్జీఓ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. గురువారం ఎన్జీఓ హోంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ ప్రకటించి 6 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఐఆర్ ప్రకటించలేదని, వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీన జేఏసీ సమావేశంలో ఉద్యమకార్యాచరణ ప్రకటించి 12న చీఫ్ సెక్రటరీకి నోటీసులు అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలాబేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు శోభారాణి, మహేష్, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయండి

● సీఐని ఆదేశించిన జాయింట్ కలెక్టర్

కొత్తచెరువు, ఫిబ్రవరి 8: మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుంచపు దుర్గేశ్‌పై దాడిచేసిన సర్పంచ్ తనయుడు నారాయణస్వామిపై కేసు నమోదు చేయాలని సీఐ రాజారమేశ్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం లోచర్ల గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. దాడికి సంబంధించిన కారణాలను సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడిచేయడం మంచి పద్ధతికాదన్నారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ భాగ్యరేఖకు ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి, డిప్యూటీ తహసీల్దార్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కురుబ నేతలు స్పందించరా ..?

టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8: కురుబ సామాజిక వర్గానికి చెందిన కానిస్టేబుల్‌ను దారుణంగా హత్య చేసినా.. జిల్లాకు చెందిన వైసీపీ కురుబ ప్రజాప్రతినిధులు నోరుమెదకపోవడం దారుణమని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మండిపడ్డారు. గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ధర్మవరం మండలం గుంటకిందపల్లికి చెందిన కానిస్టేబుల్ కురుబ గణేష్‌ను తిరుపతిలో ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో హత్యకు గురయ్యాడన్నారు. కురబ సామాజిక వర్గానికి చెందిన గణేష్ హత్యపై మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి శంకర్‌నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు మౌనం వహించడం దేనికి సంకేతమని నిలదీశారు. కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించే తీరిక కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. కురబలకు మీరిచ్చే భరోసా, మర్యాదా ఇదేనా అని ప్రశ్నించారు. కానిస్టేబుల్ హత్యకు కారణమైన వారికి ఉరితీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, టీఎన్‌టీయూసీ నాయకులు బ్యాళ్ల నాగేంద్ర, పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి, ఓబుళపతి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఆవుల కృష్ణయ్య

రాప్తాడులో వైసీపీపై తిరుగుబాటు

చెప్పి మరీ టీడీపీలోకి చేరికలు : మాజీ మంత్రి పరిటాల సునీత

సాయినాథ్‌రెడ్డి, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరిక


చియ్యేడులో మాట్లాడుతున్న పరిటాల సునీత, చిత్రంలో సాయినాథ్‌రెడ్డి, టీడీపీలోకి చేరిన చిన్నపల్లి గ్రామ వైసీపీ నాయకులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: వైసీపీలోని నాయకులు, కార్యకర్తలు పాలకులపై తిరుగుబాటు చేస్తున్నారని, వారికి చెప్పి మరీ టీడీపీలో చేరుతున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని చియ్యేడు గ్రామంలో ఆ గ్రామానికి చెందిన వైసీపీ కీలక నేత చిన్నగొర్ల సాయినాథ్‌రెడ్డితో పాటు మరో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. పరిటాల సునీత వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పరిటాల సునీత మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గం వైసీపీలో తిరుగుబాటు మొదలైందన్నారు. ఆ పార్టీ నేతలు ఎమ్మెల్యేను హెచ్చరించి టీడీపీలోకి వస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలేకాకుండా ఆపార్టీ నాయకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరుల తీరుతో విసిగిపోయారన్నారు. గెలిపించినందుకు కనీస గౌరవం ఇవ్వకుండా ఆ సోదరులు వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. అందుకే ఆపార్టీ నేతలంతా టీడీపీలోకి వస్తున్నారన్నారు. సాయినాథ్‌రెడ్డి గ్రామంలో మంచి పేరుందని, అలాంటి వారు పార్టీ వీడారంటే ఎమ్మెల్యే సోదరులు ఎంత బాధపెట్టారో అర్థమవుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీలు వేణుగోపాల్, రామలింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, చియ్యేడు లక్ష్మీనారాయణ, వైస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నపల్లి వైసీపీ నాయకులు టీడీపీలోకి...

చెన్నేకొత్తపల్లి : మండలంలోని చిన్నపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సమక్షంలో నాగభూషణ, మల్లయ్య, చిరంజీవి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగసుబ్రమణ్యం, రామాంజినేయులు, నరసింహులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జగన్‌రెడ్డి తీవ్ర ద్రోహం


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 8: ఏటా మెగా డీఎస్సీ విడుదల చేస్తామని అధికారం లోకి వచ్చిన జగన్‌రెడ్డి... ఆ హామీని అమలు చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశాడని టీడీపీ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు బసంపల్లి చంద్రాయుడు మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో గురువారం ఆయన మాట్లాడుతూ... డీఎస్సీ, టెట్‌ను ఒకేసారి విడుదల చేయడం వల్ల సమయం ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు భార్గవ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూ స్తున్నారని, ప్రభుత్వం కేవలం 6,100 పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు జెన్న నాగార్జున, టీడీపీ నాయకులు బన్నాల సూర్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేంద్రరెడ్డి, ఐటీడీపీ పవన్ పాల్గొన్నారు.

వైసీపీలోని కాపు నాయకులు... ద్రోహులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8: వైసీపీలోని కాపు నాయకులు కులం పేరుతో పదవులు పొంది... అదే జాతికి ద్రోహం చేస్తున్నారని టీడీపీ నాయకుడు లక్ష్మన్న విమర్శించారు. అనంతపురం క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చిందని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని తొలగించి కాపులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కాపుల సమస్యలను పరిష్కరించలేని వైసీపీలోని కాపు దద్దమ్మ నేతలు జాతికి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు సొంత నిధులతో ఆదుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కాపులకు టీడీపీ, జనసేన ప్రభుత్వం తోనే మేలు జరుగుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గార్లదిన్నె, ఫిబ్రవరి 8: మండలంలోని కల్లూరు, బూదేడు, కృష్ణాపురం, కేశవాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లోకేశ్వరీ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

రాప్తాడు : మండలంలోని రాప్తాడు గంగలకుంట, అయ్యవారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ గీతావాణి గురువారం పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఈఓఆర్డీ నరసింహారెడ్డి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

శింగనమల : మండలంలోని శింగనమల, గోవిందరాయనిపేట, సొదనపల్లి, మట్లగొంది, గుమ్మేపల్లి, కల్లుమడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శోభన్‌బాబు, సెక్టోల్ అధికారి సీడీపీఓ ఉమాశంకరమ్మ గురువారం పరిశీలించారు. వారి వెంట అధికారులు ఉదయ్‌కుమార్, బీఎల్ఓలు ఉన్నారు.

బటన్‌రెడ్డికి బుద్ధిచెప్పండి :జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థికి ఓటు బటన్ నొక్కి... జగన్‌రెడ్డిని ఓడించి.. తగిన బుద్ధి చెప్పాలని జనసేన పార్టీ రాయలసీమ రీజిన్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత పిలుపునిచ్చారు. సీఎం జగన్‌రెడ్డి బటన్ నొక్కడమే అభివృద్ధి అనుకుంటున్నాడని ఎద్దేవ చేశారు. గురువారం మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 26వ డివిజన్‌లోని హమాలీ కాలనీ పర్యటించిన ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి వస్తువు ధర పెరగడంతో మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్ తన నియంత పాలనతో ఎమ్మెల్యేలను రోబోలుగా తయారు చేసి నియోజకవర్గాల అభివృద్ధిని నాశనం చేశారన్నారు. దీనివల్ల ఏ డివిజన్, పంచాయతీల్లోకి వెళ్లినా ప్రజలు మౌలిక సదుపాయాల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: విద్యుత్ సంస్థలోని కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని ఆ యూనియన్ (బి-2841)నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి గురువారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్మికుల డిమాండ్ల పరిష్కరంలో యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. డైరెక్ట్ పేమెంట్, 2014 జూన్ 2 నుంచి ఉన్న వారిని క్రమబద్ధీకరించాలని, 2022 ఏప్రిల్ నుంచి ఉన్న వేతన బకాయిలు ఇవ్వాలని, ఒకే కేడర్‌లో పనిచేస్తున్న వారికి ఒకే వేతనం ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహాజన సభను విజయవంతం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: ది అనంతపూర్ డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మార్చి 3న నిర్వహించబోయే మహాజన సభను విజయవంతం చేయాలని ఆ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఆర్‌కే ప్రసాద్, హర్షవర్ధన్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించే ఈ సభకు పాలకవర్గ సభ్యులందరూ పాల్గొనాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన షెక్షావలి (45) గురువారం విద్యుదాఘాతానికి గురై మరణించాడు. పొలం వద్ద పనిచేస్తు ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. షెక్షావలికి భార్య సోనియా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు సహకరించండి : కలెక్టరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 8: జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా సహకరించాలని అధికారులకు కలెక్టరు గౌతమి సూచించారు. పరిశ్రమల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి కల్పించే పరిశ్రమలకు తప్పనిసరిగా ప్రోత్సాహం అందించాలని, పారిశ్రామికవాడల్లో పరిశ్రమలకు కేటాయించిన స్థలాల్లో పరిశ్రమలనే నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతినెలా రాప్తాడులో నెలకొల్పే యూనిట్ల ప్రగతి నివేదికలు అందించాలని సూచించారు. 2023-24లో 75 దరఖాస్తులు రాగా అందులో 58 ఆమోదించారని, మిగిలిన వాటికి వెంటనే ఆమోదానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పీఎంఈజీపీకి సంబంధించి 2023-24లో 1,037 దరఖాస్తులు రాగా, వివిధ బ్యాంకుల్లో 246 యూనిట్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయన్నారు. విశ్వకర్మయోజన పథకంపై అవగాహన పెంచాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 87,130 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, పరిశ్రమల శాఖాధికారి నాగరాజు, ఏపీఐఐపీజడ్ఎం సోనీ, వ్యవసాయశాఖ జేడీ ఉమాశంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ స్కేటింగ్‌కు.. ఆల్ ది బెస్ట్

తాడిపత్రికి చెందిన రమణమహర్షి అనాథాశ్రమ విద్యార్థులు 750 కిలో మీటర్లు రోడ్ స్కేటింగ్‌కు శ్రీకారం చుట్టారు. గురువారం వారు కలెక్టర్‌ను కలిసారు. రోడ్ స్కేటింగ్‌కు అన్నిరకాలుగా సహకారం అందిస్తామని కలెక్టరు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తీచేయాలని ఆ విద్యార్థులకు కలెక్టరు ఆల్ దబెస్ట్ చెప్పారు.

పురావస్తు సంపద సంరక్షణకు సిద్ధం

ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8: పురావస్తు సంపద సంరక్షణకు తమ సంస్థ సిద్ధంగా ఉందని (అఖిల భారత కళలు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ) ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా పేర్కొన్నారు. గురువారం ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన తొలుత లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. రాత్రికి అనంతపురం నగరానికి చేరుకుని కమలా నగర్‌లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనేక పురావస్తు కట్టడాలు, శాసనాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అయితే వాటి చరిత్రను కనుగునే ప్రక్రియలో భారత దేశీయ పద్ధతిలో కాకుండా బ్రిటీష్ వారి పద్ధతిలో రసాయనాలు వాడి పరిశోధనలు చేయడంవల్ల ఆ శిలాశాసనాలు షేడ్ అవుతున్నాయన్నారు. అలా కాకుండా సంప్రదాయ భారత దేశీయ పద్ధతిలో శాసనాలు, శిలలు, కట్టడాల చరిత్రను గుర్తించి వెలుగులోకి తెచ్చేందుకు ఇంటాక్ సిద్ధంగా ఉందన్నారు. లేపాక్షి చరిత్ర అపూర్వమైనదని, లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం ప్రతి ఒక్కరం సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పురావస్తుశాఖ ఏడీ రజిత, ఇంటాక్ కన్వీనర్లు రామ్‌కుమార్, చంద్రహాస్‌రెడ్డి, వేణుగోపాల్, గంగిరెడ్డి అశ్వర్ధరెడ్డి, సాహితీవేత్తలు జెన్నె ఆనంద్ కుమార్, జూటూరు షరీఫ్, మధురశ్రీ, నానీల నాగేంద్ర, కొత్తపల్లి సురేష్, షేక్ రియాజుద్దీన్, ఆకుల రఘు రామయ్య, అప్పిరెడ్డి హరి నాథరెడ్డి, నబిరసూల్, మిద్దె మురళీకృష్ణ, వన్నప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా

జిల్లా బాలికల హాకీ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా బాలికల హాకీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8: స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో జూనియర్ జిల్లా బాలికల హాకీ జట్టును గురువారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్టులో... నందిని, మల్లిక, లక్ష్మి, మైథిలి, సాయిభవ్య, వర్షిణి, మనోగ్న, భావన, స్వీటి, భాను తేజస్వణి, మంజూష, శాలిని, సమీరా, భవ్యశ్రీ, హనీ, అరీఫా ఉన్నట్లు హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే 14వ ఏపీ జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అక్రమ్‌బాషా, కోచ్ శంకర్, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్, కోశాధికారి అబ్దుల్, సభ్యులు లోకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ కమిటీ ఎన్నిక


నూతన సభ్యులను అభినందిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 8: జిల్లా కార్మిక పరిషత్ నూతన రీజనల్ కమిటీ ఎన్నికైంది. అధ్య క్షుడిగా వాసుదే వరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాధాకృష్ణ, చీఫ్ అడ్వైజరీగా నారాయ ణ, ఉపాధ్యక్షుడిగా గోపాల్, కార్యదర్శిగా ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఆ సంఘం కార్యాలయంలో వారిని గురువారం పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సంగప్ప, ఓబుళపతి, రవి, పరమేశ్వర్, భాస్కర్, వెంకటేశులు, లోకేష్ పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐ రామారావు బదిలీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8: విజిలెన్స్ సీఐ రామారావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కళ్యాణదుర్గంలో రూరల్ సీఐగా ఉండి వీఆర్‌కు వచ్చిన శ్రీనివాసులు నియమితులయ్యారు. రామారావు బుధవారం రిలీవ్ కాగా, శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు.

శాస్త్రోక్తంగా మాసశివరాత్రి పూజలు


అలంకరణలో స్వామి వారు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8: మాస శివరాత్రిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరకోదండ రామాల యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వర స్వామికి ప్రదోషకాలంలో అభిషేకం నిర్వహించడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, పూజాది కైంకర్యాలు నిర్వహించారు. కార్య క్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాజి ఉరుసు


శింగనమలలో స్వామివార్ల ఊరేగింపు

శింగనమల,ఫిబ్రవరి 8: శింగనమల హజ్రత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి ఉరుసును భక్తి శ్రద్ధలతో గురువారం నిర్వహించారు. తెల్లవాజమున గంధం కార్యక్రమంలో పక్కీర్ల జల్సాలతో స్వామి వారిని ఊరేగించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు దర్గాలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రార్థనలు చేశారు. ఇరుసు పందెలు నిర్వహించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నియోజకవర్గం టీడీపీ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు దర్గాలో ప్రత్యేక పార్థనలు చేశారు. రాత్రి ఖవాలి ఏర్పాటు చేశారు. డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దామని ఏపీ జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు రఫీ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని స్థాపించేందుకు ఈ నెల 18 వరకూ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు నవాజ్ అహ్మద్, సభ్యులు యాసీర్, యుజఫర్, జిలాన్, హాజీపీరా, ఎజాజ్, ఉమర్ పాల్గొన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి


రమేష్ మృతదేహం

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 8: కనగానపల్లి మండలంలోని తగరకుంట సమీపంలో హంద్రీనీవా నీటికాలువలో గల్లంతైన రమేష్ (32) మరణించినట్లు కనగానపల్లి పోలీసులు గురువారం తెలిపారు. ధర్మవరం పట్టణంలోని సాయినగర్‌కు చెందిన రమేష్ బెంగుళూరులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 6న కనగానపల్లి మండలంలోని తూంచెర్లలో గ్రామంలో జరిగే ఊరిదేవరకు బంధువుల ఇంటికి వచ్చాడు. గ్రామ సమీపంలోని తగరకుంట వద్ద ఉన్న హంద్రీనీవా కాలువ వద్దకు తన బంధువుల పిల్లలతో వెళ్లాడు. ఓ పిల్లవాడు నీటిలో జారిపడగా... రమేష్ నీటిలోకి దూకి ఆ పిల్లవాడ్ని కాపాడి గట్టున చేర్చాడు. కానీ రమేష్ అధిక నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. బుధవారం రాత్రంతా పోలీసులు, రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లు గాలించినా ఫలితం లేకుండా పోయింది. గురువారం మధ్యాహ్నం సుమారు కిలోమీటర్ దూరంలో అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రమేష్‌కు భార్య నందిని, ఒక కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ ఆత్మహత్య

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని కుంటిమద్ది గ్రామంలో ధనుంజయ భార్య అపేక్ష (19) ఉరేసుకొని గురువారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. గంతిమర్రి గ్రామానికి చెందిన అపేక్షకు మూడు నెలల క్రితం ధనుంజయతో వివాహమైంది. అప్పటి నుంచి అత్తారింటిలో ఉండేది. గురువారం మధ్యాహ్నం అపేక్ష తన తండ్రి నారాయణకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో... అతను వచ్చేలోగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏడు క్వింటాళ్ల బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8: స్థానిక బిందెలవారి కాలనీలోని ఓ ఇంటి ఆవరణంలో నిలువ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీ దుర్గాప్రసాద్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ సాయిప్రసాద్, ఏఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జగన్ మోసం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సీఎం జగన్ మోసం చేశాడని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు మండిపడ్డారు. గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం జగన్ ప్రకటించి మాట తప్పారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

రోడ్డు నియమాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

అనంతపురం అర్బన్: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నివమావళిలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతపురం ఆర్టీఓ సురే ష్‌నాయుడు మాట్లాడుతూ.. అధిక వేగంతో ఆటోలు నడపరాదని, మోతాదుకు మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మద్యం తాగి వాహనం నడపకూడ దని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమణారెడ్డి, శ్రీనివాసులు, సునీత పాల్గొన్నారు.

18న రుక్మిణీ కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8: వివాహం కోరుకునే యువతీ యువకుల కోసం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 18న స్థానిక సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ పేర్కొన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ రుక్మిణీ కల్యాణం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ సాయి కుమార్ మాట్లాడుతూ... ఉన్నత చదువులు, ఉద్యోగం ఉన్నా చాలామంది యువతీ యువకులకు వివాహాలు కాక వారి తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దైవసంకల్పంతో త్వరగా వివాహం జరగాలని కాంక్షిస్తూ ఈనెల 18న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవివాహిత యువతీ యువకులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొనదలచినవారు ముందుగా 87123 45520, 96667 56921 నెంబర్లను సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో సాయిట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పంపిణీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాయీబ్రాహ్మణ గుర్తింపు కార్డులను బీసీ సంక్షేమశాఖాధికారులు గురువారం పలువురికి అందజేశారు. గురువారం బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో డీడీ కుష్బూకొఠారీ ఆధ్వర్యంలో ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన 70 మంది నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు ఈ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, యల్లనూరు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మార్గ్‌లో అక్రమ కట్టడంపై చర్యలేవీ..?

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8 : అనంతపురం ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని టీడీపీ నాయకులు జేఎం బాషా, మల్లికార్జున మండిపడ్డారు. గురువారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డును ఆక్రమించి భవనం నిర్మించడంతో ప్రమాదరకంగా మారిందని, ఇదివరకే నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

జగన్ పాలనలో బీసీ కార్పొరేషన్లు నిర్వీర్యం

● **జయహో బీసీ సభలో మాజీ మంత్రి కాలవ**

కణేకల్లు, ఫిబ్రవరి 8: జగన్ పాలనలో బీసీ కార్పొరేషన్లు అన్నీ నిర్వీర్యం అయ్యాయని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం మండలంలోని కళేకుర్తి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలవ మాట్లాడుతూ ఎన్నికల్లో బీసీలకు అనేక హామీలిచ్చి ఓట్లను దండుకున్న జగన్ గద్దెనెక్కగానే ఉత్తుత్తి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. టీడీపీ ద్వారానే బీసీల రాజ్యాధికారం సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా చంద్రబాబుకు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ పెట్టిన భిక్షతో 11 ఏళ్ల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా ఉండి ఇటీవల చంద్రబాబునాయుడును ఉద్దేశించి ఆయన అధికారంలోకి వస్తే వర్షాలు రావని మెట్టు గోవిందరెడ్డి ఆరోపణలు చేస్తున్నాడని, ఇది సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబును ఉద్దేశించి ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కిష్టయ్య, జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, బీసీ నాయకులు గాండ్ల విశాలాక్షి, ఎస్‌కే మల్లికార్జున, బ్యాళ్ల నాగేంద్ర, నారాయణస్వామితో పాటు టీడీపీ నాయకులు లాలెప్ప,


మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు నైపుణ్య శిక్షణా, ఉద్యోగ అవకాశాలకు శిక్షణ ఇస్తామని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. హౌస్ వైరింగ్, మోటారు రీవైండింగ్ కోర్సులో నాణ్యతగల సాంకేతికత నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు. మరమ్మత్తులపై శిక్షణతో పాటు వ్యక్తిత్వవికాసం, ఇంగ్లీష్, కస్టమర్లతో ఎలా మెలగాలి అనే అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 45రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 8, 9, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉండాలని తెలిపారు. శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని, అనంతరం నూరు శాతం ఉపాధి కల్పిస్తామని అన్నారు. ఈనెల 12 ప్రారంభించే ఈ శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలకు 85000 74757, 77807 52418ను సంప్రదించాలని కోరారు.

మందులతో హెచ్‌ఐవీ నియంత్రణ

ఎయిడ్స్ నియంత్రణ జిల్లా అధికారి అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 8: సకాలంలో.. సక్రమంగా మందులు వాడితే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని ఎయిడ్స్ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా మందులు వాడితే పట్టబోయే పిల్లలకు ఆ వ్యాధి సోకకుండా చూడొచ్చని సూచించారు. గురువారం స్థానిక ఏఆర్‌టీ సెంటర్‌లో సాథి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ గర్భిణీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భందాల్చిన మూడు నెలల్లోపు రక్తపరీక్షలతో పాటు హెచ్‌ఐవీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఒకవేళ హెచ్‌ఐవీ ఉందని నిర్ధారణ అయితే దగ్గరలోని ఏఆర్‌టీ సెంటర్‌కు వెళ్లి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. అక్కడ ఉచితంగా మందులు ఇస్తారన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న స్త్రీలు కుటుంబ నియంత్రణ కోసం ఏ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా అక్క డ శస్త్ర చికిత్స జరిగేలా రాష్ట్రస్థాయి అధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేసేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, డాక్టర్ శ్రావ్యస్వాతి, ప్రోగ్రాం ఆఫీసర్ శేషాద్రి, కమల, కవిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అనుపమ జేమ్స్

అభివృద్ధి ప్రధాత చంద్రబాబు: మాజీ ఎమ్మెల్యే



ప్రజలకు నమస్కరిస్తూ మద్దతు కోరుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

పామిడి, ఫిబ్రవరి 8: అభివృద్ధి ప్రధాత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అని గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలోని బీసీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారులు, ప్రజలను, పలు కుటుంబాలను గురువారం ఆయన కలిశారు. ఆయన మాట్లాడుతూ... నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ఏ రంగమూ సంతృప్తికరంగా లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందకపోగా జరుగుతున్న అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు, కొన్నింటిని పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. వైసీపీ పాలనలో యువత పూర్తిగా పెడదోవపడుతోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేక తల్లిదండ్రులు చేసే పనులే చేస్తుండడంతో ఆ తల్లిదండ్రుల కడుపు తరుక్కుపోతోందన్నారు. కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దూదేకుల గౌస్‌పీరా, లక్ష్మినారాయణరెడ్డి, జింకల సంజీవకుమార్, మాజీ కౌన్సిలర్లు చెన్నవరం మహబూబ్ బాషా, టీటీ రమణరావు, శివశంకర్, రామకష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, రంగస్వామి యాదవ్, బాబా, రఫీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కండి

● 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్'పై విద్యార్థులకు అవగాహన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు, ఐ-టీడీపీ కోఆర్డినేటర్లు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 8: మీ మొదటి ఓటుతో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని జ్యోతిర్మయి బాలికల డిగ్రీ కళాశాలలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు వుంటుందని, ఆ యువతకు వచ్చిన మొదటి ఓటు హక్కు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే చంద్రబాబునాయుడుకు ఓటు వేయాలని కోరారు. రాబోయే ఐదు సంవత్సరాలలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి బిక్కి రామలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, ఆదిమూలం మంజు, శ్రీరాములు, మల్లికార్జున, రమాదేవి, విరుపాక్షి, కురుబ కుమార్, కామక్కపల్లి నాగరాజు, మంజు, భోగేష్, బొమ్మన్న, గంగన్న, బ్రిజేష్, వెంకటేశులు, సుధాకర్, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 8: రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. వైద్యులకు, సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. పేరుకేమో 50పడకల ఆసుపత్రి అని, రోగులకు సంబంధించిన ఎలాంటి పరికరాలు లేవన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటానని డీసీహెచ్‌ఎస్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మధుసూదన్, రంగారెడ్డి, శీనప్ప, మురళి, వీరాంజనేయులు, వెంకటేష్, రవికుమార్, సిద్ధప్ప పాల్గొన్నారు.

కల్పనకు బాల సాహిత్య పురస్కారం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 8: మండలంలోని తిమ్మాపురం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థిని కే కల్పనకు బాల సాహిత్య పురస్కారం ప్రకటించినట్లు ప్రాధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి గురువారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్టు ఈ అవార్డు అందించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కల్పనకు ప్రశంస పత్రం, నగదు బహుమతిని పోస్టు ద్వారా పంపారన్నారు. కల్పనను ఉపాధ్యాయులు చంద్రమోహన్, మనోహర్, లతామణి, సుజాత, పుష్పావతి అభినందించారు.

వైసీపీ కార్పొరేటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఉరవకొండ, ఫిబ్రవరి 8: ప్రజా ప్రతినిధి అయ్యి ఉండి రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్న కర్నూలు కార్పొరేటర్ కృష్ణకాంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఈఆర్వో శిరీష ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలైనా ఈఆర్వో, ఏఈఆర్వోలు రాకపోవడంతో పలు పార్టీల నాయకులు వెళ్లిపోయారు. సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలించినా తుది జాబితాలో తప్పులు ఉన్నాయన్నారు. తహసీల్దార్లు శ్రీనివాసులు, దస్తగిరయ్య, మహమ్మద్ రఫీ, హరినాథ్, రత్నరాధిక, ఈడీటీ మునీంద్ర, ఎస్‌పి సాయి వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాయదుర్గం, ఫిబ్రవరి 8: మండలంలోని 74 ఉడేగోళం ఆర్డీటీ కార్యాలయంలో బుధవారం క్విజ్‌పోటీలు నిర్వహించినట్లు ఏటీఎం పుల్లారెడ్డి గురువారం తెలిపారు. ఆర్డీటీ కార్యాలయంలో రాయదుర్గం, డీ.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాలలో ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించామన్నారు. మండలంలోని ఆర్‌బీవంక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న శ్రీవాణి, గాయత్రి, తేజలు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ నాగమణి పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

స్కేటింగ్ నిర్వహణకు సహకరించండి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 8: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులు 12వ తేదీన చేపట్టనున్న 750కిలోమీటర్ల రోడ్డు స్కేటింగ్ నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ గౌతమికి విన్నవించారు. గురువారం జిల్లాకేంద్రంలో ఆశ్రమ సెక్రటరీ మహేష్, స్కేటింగ్ కోచ్ మధు విద్యార్థులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. స్కేటింగ్ తాడిపత్రి నుంచి గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, ధర్మవరం మీదుగా తాడిపత్రికి చేరుకుంటుందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణపై సమావేశం

పుట్లూరు, ఫిబ్రవరి8: మండలంలోని చింతకుంట గ్రామంలో గురువారం రాత్రి భైరవస్వామి ఆలయ జీర్ణోద్ధరణపై గ్రామస్థులతో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ హేమాద్రి సమావేశం నిర్వహించారు. గ్రామస్థులు ఆలయ నిర్మాణానికి సహకరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. చిన్నపాటి సమస్యలను పట్టించుకోకుండా కలిసికట్టుగా నిర్మించుకోవాలని వారు సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై అవగాహన

గుత్తి, ఫిబ్రవరి 8: పట్టణంలోని కోట వీధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్‌పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నుంచి మెయిన్ బజార్ వరకు ర్యాలీ కొనసాగింది. పట్టణంలో ఓ బేకరీలో కేక్, బ్రెడ్ తయారీపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉపాధి ఎలా పొందాలన్న అంశంపై ట్రైనర్ మంజుభార్గవి శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం సుభహాన్ పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు మదనపల్లి శ్యామలాకృష్ణ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ బీ శశివర్ధన్‌రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ రెండు సంవత్సరాలు, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే రామ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో బీసీ కార్పొరేషన్లు నిర్వీర్యం

● జయహో బీసీ సభలో మాజీ మంత్రి కాలవ



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఫిబ్రవరి 8: జగన్ పాలనలో బీసీ కార్పొరేషన్లు అన్నీ నిర్వీర్యం అయ్యాయని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం మండలంలోని కళేకుర్తి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలవ మాట్లాడుతూ ఎన్నికల్లో బీసీలకు అనేక హామీలిచ్చి ఓట్లను దండుకున్న జగన్ గద్దెనెక్కగానే ఉత్తుత్తి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. టీడీపీ ద్వారానే బీసీల రాజ్యాధికారం సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా చంద్రబాబుకు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ పెట్టిన భిక్షతో 11 ఏళ్ల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా ఉండి ఇటీవల చంద్రబాబు నాయుడును ఉద్దేశించి ఆయన అధికారంలోకి వస్తే వర్షాలు రావని మెట్టు గోవిందరెడ్డి ఆరోపణలు చేస్తున్నాడని, ఇది సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబును ఉద్దేశించి ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కిష్టయ్య, జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, బీసీ నాయకులు గాండ్ల విశాలాక్షి, ఎస్‌కే మల్లికార్జున, బ్యాళ్ల నాగేంద్ర, నారాయణస్వామితో పాటు టీడీపీ నాయకులు లాలెప్ప, ఉండాల హనుమంతరెడ్డి, ఆనంద్, వేలూరు మరియప్పచ కళేకుర్తి సుదర్శన్, ఆది, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, వన్నారెడ్డి, బసవరాజు, చంద్రశేఖర్ గుప్తా, మాబుసాబ్, చాంద్‌బాషా, చిన్న సలీం, మారుతి, నరేంద్ర, ప్రభాకర్, కృష్ణారెడ్డి, సూరి, ప్రకాష్, హరి, విజయ్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

● పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్



జల్లిపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న పయ్యావుల కేశవ్

కూడేరు, ఫిబ్రవరి 8: వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి రాష్ట్రాన్ని కాపాడుకుందామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. గురువారం కూడేరు మండలం జల్లిపల్లి, కొర్రకోడు, హంసపల్లి, పీఏబీఆర్ డ్యాం గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పయ్యావుల కేశవ్‌కు ఆయా గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు, మహిళలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ ప్రకటించిన ఆరు పథకాలను ఇంటింటికి వెళ్లి మహిళలకు వివరిస్తూ ముందుకు సాగారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్తు: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీని గద్దెదించే బాధ్యత నిరుదోగ్య యువత, విద్యార్థులదేనని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరుగుతుండగా ఎమ్మెల్యే కేశవ్‌ను చూసిన విద్యార్థులు ఆయనతో ముచ్చటించారు. నిరుదోగ్య యువతీ యువకుల భవిష్యత్తుకు భరోసా బాబుతోనే సాధ్యామవుతున్నారు.

రాక్షస ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం

కళ్యాణదుర్గం: రాక్షస ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. గురువారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ఒంటిమిద్ది గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూసూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, తలారి సత్తి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేమతాబాద్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ

గుత్తిరూరల్: మండలంలోని నేమతాబాద్‌లో గురువారం టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. దేవరపల్లి సర్పంచు ప్రతాప్, నారాయణ, నాగేశ్వరరావు, సోమశేఖర్, కదిరెప్ప, చాగంటి గోవిందురాజులు, మనోహర్, జానికి, మాధవి, అరుణ, రాధ పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న హిమబిందు

బీసీ గర్జనను విజయవంతం చేయండి

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 8: మండలంలోని కలుగోడులో 11వ తేదీన నిర్వహించే జయహో బీసీ గర్జనను విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న పిలుపునిచ్చారు. సభకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎంపీ బీకే పార్థసారథి తో పాటు ఉమ్మడి జిల్లాలోని బీసీనాయకులు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, నాయకులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సుంకం వేలం ద్వారా రూ.46.80 లక్షల ఆదాయం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 8: దిన, వారపు కూరగాయల మార్కెట్, మాంసం మార్కెట్, పశువధశాల, మేకలు, గొర్రెల వధశాల నుంచి సుంకం వసూలు చేసుకొనే హక్కును కల్పించేందుకు బహిరంగ వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి రూ.46.80 లక్షలు ఆదాయం లభించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ వెంకటనారాయణప్ప అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. దిన, వారపు కూరగాయల మార్కెట్ రూ.41.85లక్షలు, మటన్ మార్కెట్ రూ.2.52లక్షలు, పశువధ శాల రూ.1.19 లక్షలు, మేకలు, గొర్రెలు రూ.1.24లక్షలకు వేలం పాటలో ఈ నాలుగింటిని కాంట్రాక్టర్ మాచర్ల శివ దక్కించుకున్నారు. ఆర్‌ఐ ఎర్రిస్వామి, ఏ1 మురళి, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికలపై అధికారులతో సమీక్ష

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 8: ఎన్నికలపై అన్ని శాఖ అధికారులతో ఆర్డీవో రాణి సుష్మిత, డీఎస్పీ శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన పోలీస్, రెవెన్యూ, ఇతర ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. బీఎల్వోలు, ఎంపీఈవోలు సంయుక్తంగా కోఆర్డినేషన్ చేసుకుంటూ ఒక ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. అన్ని మండలాల ఎస్‌ఐలు, ఇతర శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

కుందుర్పి, ఫిబ్రవరి 8: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు కే క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా కే రాజు, ఉపాధ్యక్షులుగా వరలక్ష్మీ, సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా రేవణ్ణ, కార్యదర్శులు బాబు వీరేష్, ఆర్థిక కార్యదర్శి గురుస్వామి, జిల్లా కౌన్సిలర్లు కే క్రిష్ణమూర్తి, పీ రాధాకృష్ణం రాజు, చెన్నరాయప్ప, హనుమంతప్ప, క్రిష్ణమూర్తి, మహిళా కన్వీనర్ వాణి, సీనియర్ కన్వీనర్ తిప్పేస్వామి, కమిటీ పెద్దలు, పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 8: ఎస్ఎల్ఎల్ చరిత హాకీ క్లబ్ నుంచి ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు క్లబ్ ప్రెసిడెంట్ గోళ్ల సూరి తెలిపారు. అనంతపురంలో జరిగిన సబ్ జూనియర్స్ హాకీ ఎంపిక పోటీల్లో సత్తాచాటి బాలుర విభాగంలో కిరణ్, చరణ్, వరుణ్, నందకిషోర్, రాహుల్, చరణ్, బాలికల విభాగంలో భవ్యశ్రీ ఎంపికైనట్ల తెలిపారు. విద్యార్థులను సూరి, సురేష్, ఆర్ఎస్‌ఐ జగదీష్, సెక్రెటరీ మోహన్ అభినందించారు.

రోడ్డుభద్రతా నియమాలు పాటించాలి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 8: డ్రైవర్లు రోడ్డుభద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 8: ఈ రబీ సీజన్‌లో వేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించిన ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ, ఎంపీసీవై లింక్‌లను పూర్తి చేయాలన్నారు. ఏవో, ఏఈవో పాల్గొన్నారు.

కోరం లేదు... రండి బాబూ.. రండి!

● సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీల డుమ్మా



మహిళా ఎంపీటీసీల స్థానంలో భర్తలు, బంధువులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అధికారులకు తలనొప్పిగా మారింది. ఎంపీపీ పద్మపై అసంతృప్తి కారణంగా పలువురు ఎంపీటీసీలు ఇటీవల తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన సర్వసభ్య సమావేశానికి పలువురు ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో అధికారులు మధ్యాహ్నం వరకు ఎదురు చూపు తప్పలేదు. కోరం లేదని వాయిదా వేయడానికి అధికారులు వెనుకంజ వేశారు. మొదటగా బొల్లనగుడ్డం ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజరైంది. సమావేశ సమయానికి బొల్లనగుడ్డం, కొళగానహళ్లి ఎంపీటీసీ సభ్యులతో పాటు ఎంపీపీ పద్మ, వైస్ ఎంపీపీ రమేష్ ఉన్నారు. కోరం లేకపోవడంతో సమావేశం జరుగకుండా కోరం కోసం ఉద్దేహాళ్ ఎంపీటీసీ సభ్యురాలు కల్పన ఆలస్యంగా వచ్చారు. తిరిగి దర్గాహోన్నూరు-2 ఎంపీటీసీ శ్రీదేవి భర్త రామకృష్ణ, గోవిందవాడ-1, ఎంపీటీసీ పరిమళమ్మ భర్త సురేష్, లింగదహాళ్ మహిళా ఎంపీటీసీ బంధువు శ్రీన హాజరయ్యారు. వారి సంతకాలు సేకరించి సమావేశాన్ని 12.45 గంటలకు ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయమ్మ, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్యకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

టీడీపీ నాయకుల ఆందోళన



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



యల్లనూరులో నీటిసంపు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉరవకొండ, ఫిబ్రవరి 8: పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. అంతకు మునుపు టీడీపీ కార్యాలయం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వరకూ ఖాళీ బిందెలతో ర్యాలీగా వచ్చారు. కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. సమ్మెలో ఉన్న కార్మికులకు నాయకులు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ పదిహేను రోజులకు ఒకసారి నీటిని వదిలితే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించి నీటిని విడుదల చేయాలన్నారు. కార్యాలయం లోపల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ ఉన్నా అధికారులు లేరని చెప్పడంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఈఈతో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. కార్మికులకు జీతాలు సాయంత్రం లోపు చెల్లిస్తామని ఈఈ తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు ఆందోళనలను విరమించారు. విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, నెట్టెం రాంబాబు, నర్రా కేశన్న యర్రగుంట్ల వెంకటేశులు, ఈడిగ వేణు, పల్లా నరసింహులు, రాజేష్, నిమ్మల ప్రసాద్, వరప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

నీటి పథకం కార్మికుల ఆందోళన

యల్లనూరు: మండలంలోని చిత్రావతి నది నుంచి సరఫరా చేసే రక్షిత నీటి పథకం కార్మికులకు వేతనాలు అందకపోవడంతో నీటిసరఫరా ఆగిపోయింది. దీంతో యల్లనూరుతో పాటు ఐదు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాల్లో తాగునీటికి రెండురోజుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకంలో పనిచేసే 8మంది కార్మికులకు రెండేళ్లుగా జీతాలు నిలిచిపోయాయి. కృష్ణాపురం సంపు వద్ద గురువారం కార్మికులు నిరసన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తే తప్ప విధుల్లోకి చేరమని కార్మికులు తేల్చిచెప్పారు.

నీటి కష్టాలు



సంపులో నీటిని తోడుకుంటున్న ప్రజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 8: వేసవి ప్రారంభం కాక ముందే ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. జీతాలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు విధులను బహిష్కరించడంతో నీటి సమస్య మరింత జఠిలమైంది. ఉరవకొండలో నీటి సరఫరా ఆగిపోయి పది రోజులైంది. ఉరవకొండతో పాటు ఏడు గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఉన్న సంపులో నీటిని తీసుకెళ్తున్నారు. స్కూటర్లు, రిక్షాల్లో నీటిని తెచ్చుకుంటున్నారు.

రైతులకు అండగా ఉంటాం: జేసీపీఆర్



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

యల్లనూరు, ఫిబ్రవరి 8: చిత్రావతినదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. తిరుమలాపురం సమీపంలో ప్రతిమ కంపెనీ చేపట్టిన ఇసుకరీచ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023లోనే జేపీ కంపెనీకి ఇచ్చిన గడువు ముగిసిందన్నారు. ఆ తర్వాత ఏ కంపెనీకి అనుమతులు ఇవ్వలేదన్నారు. అన్ని అనుమతులు ఉంటే ఇవాళ రైతులతో కలిసి తాను వస్తున్న విషయం తెలిసి ఎందుకు వాహనాలు బయటకు తీసుకువెళ్లారని ప్రశ్నించారు. అనుమతులు పొంది ఉంటే రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎక్కడ హద్దులు నిర్ణయించారో చూపించాలన్నారు. ఈ ప్రభుత్వం, ఇక్కడి ప్రజాప్రతినిధులు దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఒక్కో వాహనం మీద అదనంగా రూ.1500 ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఆయన వెంట శ్రీనివాసులురెడ్డి, అచ్యుతాపురం జనార్దన్‌రెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, భైరవేష్ ఉన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 8: ప్రభుత్వ స్థలాలు, దేవదాయ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఆక్రమించిన భూములను అధికారులు స్వాధీనం చేసుకొని, వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సీకే శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, నెట్టెం బోస్, నర్రా కేశన్న యర్రగుంట్ల వెంకటేశులు, ఈడిగ వేణు, పల్లా నరసింహులు, రాజేష్, సుంకన్న, తాజుద్దీన్, నిమ్మల ప్రసాద్, వరప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

● మూడు గంటల్లోనే ఛేదించిన పోలీసులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 8: శెట్టూరు మండల పరిధిలోని చిన్నంపల్లిలో గురువారం రంజిత్ అనే బాలుడు కిడ్నాప్ కలకలం రేపింది. రూరల్ సర్కిల్ ఆఫీసులో డీఎస్పీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ చిన్నంపల్లి ప్రభుత్వ హైస్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న రంజిత్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశారన్నారు. వెంటనే తల్లి తిమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రూరల్ సీఐ నాగరాజు, శెట్టూరు ఎస్‌ఐ రాంభూపాల్, నిందితుడు ముత్రాసి సంజీవ రాయుడును కంబదూరు సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్ చేసిన సంజీవరాయుడు రంజిత్ తండ్రి కావడం విశేషం. సంజీవ రాయుడు తిమ్మక్క విడిపోయి ఏడు సంవత్సరాలు అయ్యిందన్నారు. మూడు గంటల్లోనే కిడ్నాప్ అయిన రంజిత్‌ను తల్లి, అవ్వతాతలకు అప్పగించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇంజనీరింగ్ విద్యార్థి కడపలో ఆత్మహత్య

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 8: మండలం బండూరు గ్రామానికి చెందిన లక్ష్మీ, అమరేష్ దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్(19) అనే విద్యార్థి కడపలో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపారు. అమరేష్ పెద్ద కుమారుడు అరుణ్‌కుమార్ కడపలోని అన్నమాచార్య కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం ఉరివేసుకుని చనిపోయినట్లు కళాశాల యాజమాన్యం సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతి చెందిన కారణాలు తెలియరాలేదని, ఆత్మహత్య చేసుకునే పిరికితనం అబ్బాయికి లేదని, మృతిపై అనుమానం కలుగుతోందని వారు అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు అప్పారావు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

యల్లనూరు, ఫిబ్రవరి8: మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన షెక్షావలి (45) గురువారం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. పొలం వద్ద పనిచేస్తు ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సోనియాతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

బెళుగుప్ప, ఫిబ్రవరి 8: మండలంలోని రామసాగరంలో గురువారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. గ్రామంలో టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి అరెస్టు చేశామన్నారు. ఇతని నుండి 30 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

20 బియ్యం బస్తాలు సీజ్

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 8: మండలంలోని ఐశ్వర్య విల్లాస్ సమీపంలో గురువారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న 20 బస్తాల రేషన్ బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సాగర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి యల్లనూరు మండలకేంద్రానికి చెందిన నాగేంద్రను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. బియ్యాన్ని సివిల్‌సప్లై అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి, ఫిబ్రవరి 8: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటమోహన్(37) అనే వ్యక్తి మృతి చెందినట్లు గురువారం పోలీసులు తెలిపారు. మండలంలోని లచ్చానుపల్లి గ్రామానికి చెందిన వెంకటమోహన్ జనవరి 28న లచ్చానుపల్లి రోడ్డులో ఫోన్ మాట్లాడుతుండగా గుంతకల్లు మండలం శంకరబండగ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం తగిలించడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుపై హిజ్రాల దాడి

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 8: రైతుపై హిజ్రాలు దాడి చేసి గాయపరిచిన ఘటన పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు చిత్తయ్య తెలిపిన వివరాల మేరకు స్వగ్రామం తిమ్మగానిపల్లి నుంచి పనినిమిత్తం కళ్యాణదుర్గం పట్టణానికి వచ్చా డు. తిరుగు ప్రయాణంలో పట్టణ శివారులోని బైపాస్‌లో హిజ్రాలు తన ద్విచక్ర వాహనాన్ని ఆపి కూరగాయలు తన వద్ద ఉన్న రూ.రెండు వేలు లాక్కోవడంతో రైతు ప్రతిఘటించడంతో హిజ్రాలు రాళ్లతో దాడి చేశారు. దాడిలో చిత్తయ్య తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు, ఫిబ్రవరి 8: మండలంలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి జల్లిపల్లి నుంచి హనుమాపురం వెళుతున్న ద్విచక్రవాహనం పీఏబీఆర్ డ్యాం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్, సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి, ఫిబ్రవరి 8: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్‌చేశారు. యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని వేములపాడు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పెద్దపప్పూరు నుంచి యాడికి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని ఆయన తెలిపారు.